

మేళగనూరు నుంచి కర్నూలు నగరం వరకు 135 కిలోమీటర్లు తుంగభద్ర నది ప్రవహిస్తుంది. ఏటేటా వందల టీఎంసీలు జలాలు జిల్లా సరిహద్దులు దాటిపోతున్నాయి. సముద్రం పాలవుతున్నాయి. పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర అందాలు చేసి కనువిందు చేయడం తప్పా.. ఆ నీటిని ఒడిసిపట్టి కరువు నేలను తడుపుకోలేని భిన్నమైన పరిస్థితి కర్నూలు జిల్లాది. తుంగభద్రమ్మకు అడ్డుకట్ట వేసి మెట్టపొలాలకు మళ్లించే ప్రాజెక్టులు నిర్మించపోవడమే ఇందుకు ప్రధాన కారణం. గుండ్రేవుల డ్యాం నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నా ఇంటర్ స్టేట్ సమస్య అంటూ పక్కన పడేశారు. గత ఐదేళ్లలో ఆర్డీఎస్ కుడి కాలువ పనులు సైతం ఆగిపోయాయి. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు ఉన్నా ఎల్లెల్సీ సప్లిమెంట్ మాత్రమే అంటూ పంపులు ఆన్ చేయడం లేదు. పాలకుల నిర్లక్ష్యంతో పాటు ఇంజనీర్ల బాధ్యతారాహిత్యం వెరసి కరువు రైతులకు శాపంగా మారింది. కళ్ల ముందే పోతున్న వరదను చూసి ఆనందించాలో.. నీళ్లు లేక నోళ్లు తెరుస్తున్న మెట్టచేలను చూసి 'కన్నీళ్లు' పెట్టాలో తెలియని దీనపరిస్థితి కరువు రైతులది. ఇకనైనా పాలకులు మేల్కోవాలి.. సముద్రంపాలవుతున్న తుంగభద్ర జలాలు కరువు పల్లెకు మళ్లించేలా ఉత్తమ నిర్ణయం తీసుకోవాలని మట్టిమనుషులు ఏకరువు పెడుతున్నారు.


సుంకేసుల బ్యారేజీ వద్ద తుంగభద్ర వరద పరవళ్లు

- తుంగభద్ర, కృష్ణమ్మ వరద పరవళ్లు
- సుంకేసుల నుంచి శ్రీశైలానికి 1,01,267 క్యూసెక్కులు విడుదల
- జిల్లాలో 135 కిలోమీటర్లు తుంగభద్ర ప్రవాహం
- కనువిందు తప్పా.. కరువు నేలను తడపని వైనం
- ఆర్డీఎస్ రైట్ బ్యాంక్ కెనాల్, గుండ్రేవుల డ్యాం నిర్మించని ఫలితం
- ఏటా వందల టీఎంసీలు సముద్రం పాలవుతున్న దైన్య పరిస్థితి

సాగునీరు కడలిపాలు
రైతాంగం కరువుపాలు

కర్నూలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ఉప నదుల్లో తుంగభద్ర ఒకటి. కన్నడనాట పశ్చిమ కనుమల్లో పుట్టిన తుంగ, భద్ర నదులు కూడ్లిగి వద్ద సంగమమై తుంగభద్ర నదిగా రూపాంతరం చెంది ప్రయాణం సాగిస్తుంది. 531 కిలో మీటర్లు ప్రవహిస్తూ ఉమ్మడి కర్నూలు జిల్లా సంగమేశ్వరంలోని కృష్ణా నదిలో మమేకం అవుతుంది. బళ్లారి జిల్లా హోస్పేట్ వద్ద 105.788 టీఎంసీలు సామర్థ్యంతో తుంగభద్ర డ్యాం నిర్మించారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళగనూరు దగ్గర తెలునాట అడుగుపెట్టి కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, కర్నూలు రూరల్, నందికొట్కూరు మండలాల మీదుగా ప్రవహిస్తూ కృష్ణా నదిలో కలుస్తుంది. ఈ నది దాదాపుగా 135 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. 45 గ్రామాలతో పాటు కర్నూలు నగరం తుంగభద్ర నదీతీరంలో ఉన్నాయి. ఏటా జూన్, జూలై నెలల్లో వరద మొదలవుతుంది. బచావత్ అవార్డు ప్రకారం తుంగభద్ర నది నుంచి 31.45 టీఎంసీలు (సుంకేసుల బ్యారేజీ నుంచి 21 టీఎంసీలు, హంద్రీనది ద్వారా 10.45 టీఎంసీలు) మాత్రమే కృష్ణా నదికి ఇవ్వాలని స్పష్టంగా ఉంది. అయితే గత పదేళ్ల తుంగభద్ర వరద రికార్డులు పరిశీలిస్తే.. ఏటా సగటున 215 టీఎంసీలకు పైగా తుంగభద్ర నుంచి కృష్ణా నదికి నీటిని విడుదల చేస్తున్నామని సీమ సాగునీటి నిపుణులు పేర్కొంటున్నారు. ఆ నీటిని ఒడిసిపట్టి కరువు బీడుపొలాలకు మళ్లించే అవకాశం ఉన్నా ఆ దిశగా పాలకులు ఆలోచించలేదు. ఫలితంగా కళ్ల ఎదుటే నీరు ప్రవహిస్తున్నా ప్రతి ఏటా కరువు, వలసలు మాత్రం తప్పడం లేదు.


సుంకేసుల గేట్లు దాటి శ్రీశైలం వైపు తుంగభద్ర పరుగులు

గుండ్రేవుల.. ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మిస్తేనే..


రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం తుంగభద్ర జలాల వినియోగంపై సర్వేలు చేసింది. గుండ్రేవుల జలాశయం, ఆర్డీఎస్ రైట్ బ్యాంక్ కెనాల్ సహా నాగులదిన్నె వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం, అనంతపురం జిల్లాకు తుంగభద్ర వరద ఎత్తిపోయాలనే ప్రతిపాదన, మేళగనూరు నుంచి వరద నిర్మించాలనే ఆలోచన చేశారు. చివరికి 20 టీఎంసీల సామర్థ్యంతో సుంకేసుల బ్యారేజీ ఎగువన తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మించాలని 2019లో చంద్రబాబు ప్రభుత్వం ఆలోచన చేసింది. అందుకు తగ్గట్టుగానే 2019 ఫిబ్రవరి 21న జీఓ నం.153 ద్వారా రూ.2,980 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసింది. కోసిగి మండలం సాతనూరు సమీపంలోని ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి 135 కి.మీటరులో ప్రధాన కాలువ, కోసిగి, పెద్దకడుబూరు, కోటేకల్లు, చిన్నమరివీడు గ్రామాల వద్ద 4 టీఎంసీలు సామర్థ్యంతో రిజర్వాయర్లు నిర్మించేలా ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి రూ.1,985.42 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరి 20న జీవో ఆర్‌టీ నెం.76ను ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం జారీ చేసింది. ఇన్నేళ్లకు కరువుతీరేలా కన్నీళ్లు తుడిచే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని రైతులు ఆనందించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇంటర్ స్టేట్ సమస్య అంటూ గుండ్రేవుల ప్రాజెక్టు అటకెక్కిస్తే.. నిధులు ఇవ్వకుండా ఆర్డీఎస్ కుడి కాలువను ఆపేశారు. వీటిని నిర్మించి ఉంటే లక్షల ఎకరాలకు సాగు, వివిధ గ్రామాలకు తాగునీరు అందేది. నిధులు మంజూరు చేసి జీవోలు ఇచ్చిన ఆనాటి సీఎం చంద్రబాబు ఐదేళ్ల తరువాత మళ్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ఆర్థిక కష్టాలు, అప్పుల ఊబి సాకు చూపకుండా.. చిత్తశుద్ధితో గుండ్రేవుల ఆర్డీఎస్ కుడి కాలువ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గురురాఘవేంద్ర లిఫ్టులతో అవకాశం

తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) పరిధిలో ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్ 43,519 ఎకరాలు, రబీ 1,07,615 ఎకరాలు కలిపి 1,51,134 ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. 20 మండలాల్లో 194 గ్రామాలకు తాగునీరు ఇవ్వాలి. తుంగభద్ర డ్యాం నుంచి ఎల్లెల్సీ కాలువకు 24 టీఎంసీలు నికర జలాల నీటివాటా ఉంది. పాతికేళ్లుగా ఆయకట్టు సాగు వివరాలు పరిశీలిస్తే సగం ఆయకట్టుకు కూడా సాగునీరు అందని పరిస్థితి. కోసిగి, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు, గోనేగండ్ల, సి.బెళగల్, కోడుమూరు, కర్నూలు రూరల్ మండలాల్లో దశాబ్దాలుగా చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ఎల్లెల్సీ స్థిరీకరణ ఆయకట్టుకు సాగునీరు అందని సమయంలో తుంగభద్ర జలాలు ఎత్తిపోసి పంటలను రక్షించాలనే లక్ష్యంతో 2003లో ఆనాటి టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి బీవీ మోహన్‌రెడ్డి నాటి సీఎం చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 66,815 ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా మూగలదొడ్డి, పూలచింత, దుద్ది, సోగనూరు, మాధవరం, బసలదొడ్డి, చిలకలడోణ, పులికనుమ, కులకుర్తి సహా రేమట, చింతమానుపల్లె, కృష్ణదొడ్డి, మునగాల ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఎల్లెల్సీకి అవసరమైనప్పుడు ఆరుతడి పంటలకు 'సప్లిమెంట్' చేస్తామని, రెగ్యులర్ స్కీంలు కాదని జిల్లా ఇరిగేషన్ అధికారులే అంటున్నారు. సప్లిమెంట్ పేరిట పంపులు ఆన్ చేయడం లేదు. నగం ఆయకట్టుకు కూడా సాగునీరు ఇవ్వనప్పుడు.. మిగిలిన ఆయకట్టుకు జీఆర్‌పీ లిఫ్టుల ద్వారా తుంగభద్ర జలాలు ఇచ్చే అవకాశం ఉంది. అయినప్పటికీ సప్లిమెంట్ అనే ముసుగేసి తుంగభద్రలో లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తున్నా ఎత్తిపోసుకోలేని దుస్థితి ఉందంటే.. ఆ లోపం పాలకులదా..? ఇంజనీర్లదా..? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్‌గా నీటిని ఎత్తిపోస్తే విద్యుత్ బిల్లులు, నిర్వహణ నిధులు ఎవరు ఇస్తారు..? అని ఇరిగేషన్ శాఖలో ఎస్ఈ స్థాయి అధికారి ఒకరు ప్రశ్నిస్తున్నారు. ఆర్డీఎస్ రైట్ బ్యాంక్ కెనాల్, గుండ్రేవుల ప్రాజెక్టులు వేస్ట్ అంటున్న ఇంజనీర్లు ఉన్నత స్థాయి హోదాల్లో ఉన్నారని, వాటికోసం చిత్తశుద్ధితో ఎలా పని చేయగలరని రైతులు ప్రశ్నిస్తున్నారు.

తుంగభద్రలో 1.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

తుంగభద్ర నదిలో సరాసరి 1.50 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. అంటే సుమారుగా 12.50 టీఎంసీలు. ఈ ప్రవాహం పెరిగే అవకాశం ఉందని టీబీపీ బోర్డు ఇంజనీర్లు తెలిపారు. ఈ ప్రవాహం ఐదు రోజులకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన 65 టీఎంసీలు సుంకేసుల బ్యారేజీ గేట్లు ఎత్తి కృష్ణా నదికి వదిలేయాల్సి వస్తుంది. వర్షాలు పడితే వరద రోజులు పెరిగే అవకాశం లేకపోలేదు. ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు వరకు వరద ఉంటుందని అంచనా. ఆ నీటిని నిల్వ చేసుకునే జలాశయాలు లేకపోవడంతో వచ్చిన వరద వచ్చినట్లుగానే సుంకేసుల బ్యారేజీ గేట్లెత్తి వదిలేయక తప్పదు. ఇప్పటికైనా తుంగభద్రను ఒడిసిపట్టి కరువు నేలకు మళ్లించి మెట్ట చేలను సస్యశామలం చేసే గుండ్రేవుల జలాశయం, ఆర్డీఎస్ కుడి కాలువలను పూర్తి చేయాలని జిల్లా రైతాంగం కోరుతోంది.


సుంకేసుల డ్యాం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), జూలై 28: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించామని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిండు కుండలా శ్రీశైలం

- నేడు శ్రీశైలం జలాశయం గేట్లు ఎత్తివేత
- 4,41,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ఆరు గేట్లు తెరిచే అవకాశం



జలాశయంలో 873.40 అడుగులకు చేరిన వరద

శ్రీశైలం, జూలై 28: శ్రీశైలం జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి గంట గంటకూ వరద ఉధృతి పెరుగుతుండడంతో శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్టుగేట్లను ఎత్తేందుకు జలవనరులశాఖ ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తారని ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొంటారు. మరోవైపు శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి 4,41,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయం నీటిమట్టం 885 అడుగులకుగాను 873.40 అడుగులుగా నమోదైంది. అదేవిధంగా నీటి నిల్వ 215.807 టీఎంసీలకుగాను ప్రస్తుతం 156.3860 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం కుడి, ఎడమ గట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 61,111 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. గత ఏడాది తక్కువ వర్షపాతం నమోదు కావడంతో జలాశయం గేట్లు తెరవలేదు. ఈ ఏడాది ఊహించని విధంగా వరద రావడంతో శ్రీశైలం ప్రాజెక్టు కళకళలాడుతోంది.

పది రోజుల్లోనే భారీగా చేరిన వరద

పదిరోజులుగా శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగింది. ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా దిగువ జలాశయాలకు వరద ఉధృతి క్రమ క్రమంగా పెరిగింది. దీంతో శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారడంతో మంగళవారం జలాశయం క్రస్టుగేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల నుంచి ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. గత ఏడాది తక్కువ వర్షపాతం నమోదు కావడంతో జలాశయం గేట్లు తెరవలేదు. ఈ ఏడాది ఊహించని విధంగా వరద రావడంతో శ్రీశైలం ప్రాజెక్టు కళకళలాడుతోంది.


శ్రీశైలం జలాశయం



రైలు పరుగులు.. జల పరవళ్లు

ఓ వైపు రైలు పరుగులు.. మరోవైపు జల పరవళ్లు.. ఇంకో వైపు పక్షుల వరుసలు వెరసి ఆ సుందర దృశ్యం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంది. వారం రోజులుగా తుంగభద్ర నదిలో కొనసాగుతున్న వరద దిగువకు పరుగులిడుతోంది. దీంతో మత్స్యకారులు చేపల వేటకు సిద్ధమయ్యారు. తెప్పలను తెచ్చి నదిపై వేసి చేపలు పట్టే పనిలో బిజీ బిజీగా గడుపుతున్నారు. పక్షులు నీటిపై వాలుతూ.. ఆకాశంలో విహరిస్తూ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఇలాంటి అద్భుత దృశ్యాలను వీక్షించడానికి నగర ప్రజలు సుంకేసుల జలాశయానికి తరలి వెళ్తున్నారు. అక్కడ సరదాగా గడిపి సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది. -కర్నూలు రూరల్



ఆర్డీఎస్ ఆనకట్టకు భారీగా వరద


ఆర్డీఎస్ ఆనకట్టపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు భారీగా వరద పోటెత్తుతోంది. దీంతో ఆనకట్టపైన ఐదు అడుగుల మేర వరద నీరు దిగువకు పరవళ్లు తొక్కుతోంది. తుంగభద్ర నదికి భారీగా వరద నీరు పోటెత్తడంతో అగసనూరులోని వడ్డె సిద్దయ్య, ఉలిగయ్య, ఈరన్న రైతుల పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరాయి. దీంతో రైతులు వేసిన వరిపైరు, ఉల్లి నారు పంట, వేరుశనగ పంటలు నీట మునిగాయి. వరదనీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో నదీతీర గ్రామాల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మురళి హెచ్చరికలు జారీ చేశారు.

ప్రమాదకర స్థాయిలో తుంగభద్ర ప్రవాహం

అప్రమత్తం చేసిన శ్రీమఠం అధికారులు, పోలీసులు

మంత్రాలయం, జూలై 28: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ప్రవహిస్తున్న తుంగభద్ర నది ఆదివారం సాయంత్రానికి ఉగ్రరూపం దాల్చింది. హోస్పేట్‌లోని తుంగభద్ర డ్యాం నుంచి 1,47,456 క్యూసెక్కులు దాగువకు వదలడంతో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులను తాకుతూ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. మంత్రాలయం వద్ద 311.700 మీటర్ల నీటి మట్టంతో 1,35,800 క్యూసెక్కులతో ప్రవహిస్తోంది. గంగమ్మ గుడిని వరదనీరు దిగ్బంధం చేశాయి. పుష్కరఘాట్లన్నీ మునిగాయి. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మఠం ఏఏవో మాధవశెట్టి, శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో మఠం సెక్యూరిటీ, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లతో పాటు తెప్పలను ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రాఘవేంద్ర, సీడబ్ల్యూసీ అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని లెక్కిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.


గంగమ్మ ఆలయాన్ని చుట్టుముట్టిన వరద నీరు

శ్రావణ మాస ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, జూలై 28: శ్రీశైలం మహా క్షేత్రంలో ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలను దేవస్థానం ఘనంగా నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పరిపాలనా కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఈవో మాట్లాడుతూ శ్రావణ మాసోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రాన్ని సందర్శించే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా భక్తులకు వసతి, దర్శనం, ఏర్పాట్లు, అన్నప్రసాద వితరణ, పారిశుధ్యం తదిత ఏర్పాట్లపై శ్రద్ధ కనబరచాలన్నారు. సమావేశంలో ప్రధానార్చకులు, అన్ని విభాగాల యూనిట్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన సదస్సు

కర్నూలు, జూలై 28: నూతన చట్టాలపై మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పోలీసులకు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్యా అధినీయం (బీఎస్ఏ) కొత్త, పాత చట్టాల్లో మార్పులు, చేర్పులపై డీఎస్పీ జే బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ టి.అబ్దుల్ గౌస్, మహిళా ఎస్ఐలు కలిసి అవగాహన కల్పించారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నూతన అంశాలను నేర్చుకోవాలని సూచించారు. నూతన చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి.. ఏయే సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి.. చార్జిషీట్ ఎలా తయారు చేయాలి.. దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలి.. అనే తెలుస్తాయని అన్నారు. నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాల్సి ఉంటుందని మహిళా పీఎస్ పోలీసు అధికారులు మహిలా పోలీసులకు తెలిపారు.

ఏసీఎల్ఎస్ శిక్షణ తప్పనిసరి



శిక్షణ పొందిన మూడో బ్యాచ్ పీజీ వైద్య విద్యార్థులతో ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్), జూలై 28: నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు పీజీ చేసిన వైద్యులు తప్పనిసరిగా అడ్వాన్స్‌డ్ కార్డియాక్ లైఫ్ సపోర్టు (ఏసీఎల్ఎస్) శిక్షణను ఎన్ఎంసీ తప్పనిసరిగా చేసిందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలో పీజీ వైద్య విద్యార్థుల ఏసీఎల్ఎస్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కళాశాలలో 130 మంది పీజీలు, 9 మంది సూపర్ స్పెషాలిటీ పీజీలు ఉన్నాయని, వీరికి మూడు బ్యాచ్‌లో ఏసీఎల్ఎస్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ హాస్పిటల్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్లు డా.మహేశ్వరరెడ్డి, జీజీహెచ్‌కు చెందిన డా.శ్రీలత, డా.రాధిక, డా.గోపీనాథ్, డా.మహాలింగం, అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాల, ప్రొఫెసర్ డా.కొండారెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

వైద్య సదస్సులను సద్వినియోగం చేసుకోండి



జోనల్ సీఎంఈని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూలై 28: వైద్య విజ్ఞాన సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టి నరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూక్లియర్ గ్యాలరీలో జనరల్ మెడిసిన్ జోనల్ సీఎంఈని వారు ఆదోని మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డా.డి.శ్రీరాములు, అబ్జర్వర్ ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.రామశివ నాయక్, మెడిసిన్ హెచ్‌వోడీ డా.కేఎం ఇక్బాల్ హుసేన్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ జోనల్ సీఎంఈ వల్ల వైద్య విజ్ఞానంపై అవగాహన పెరుగుతుందన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ, నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజీ, విశ్వభారతి మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్విమ్ తిరుపతి మెడికల్ కాలేజీ మెడిసిన్ ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ రిసెర్చ్ మెథడాలజీ, పబ్లికేషన్స్ ఇన్ మెడిసిన్‌పై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. న్యూరాలజీ హెచ్‌వోడీ డా.సి.శ్రీనివాసులు, అప్రోచ్ టు ఎన్ఎంవో స్పెక్ట్రమ్ డిజార్డర్స్‌పై ఉపన్యాసం ఆకట్టుకుంది. గర్భిణుల్లో లివర్ డిసీజ్‌పై గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌వోడీ డా.జి.మోహన్ రెడ్డి, నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజీ మెడిసిన్ ప్రొఫెసర్, అప్రోచ్ టు కాన్‌జెంటల్ హార్ట్ డిసీజ్ ఇన్ ఆర్డర్స్‌పై ఉపన్యసించారు.

కేంద్ర బడ్జెట్‌లో రైతులకు ప్రాధాన్యత ఏదీ..?

ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం



నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(కల్చరల్), జూలై 28: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతులకు ఎలాంటి ప్రాధాన్యత కల్పించలేదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం అన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు గల మహాత్ముని విగ్రహం ముందు ధర్నా చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కాపీలను తగులబెట్టారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జగన్నాథం, సీపీఐ నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరను చట్టబద్ధత చేస్తామని లేదా డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని పేర్కొనలేదని విమర్శించారు. రైతులకు ఉన్న పంట రుణాలు మాఫీ చేస్తామని గానీ, రైతుల ఆత్మహత్యలను అరికట్టే విధంగా వ్యవహరిస్తామని, రైతులకు సబ్సిడీలు ఇస్తామనే గట్టి హామీ కూడా బడ్జెట్‌లో పేర్కొనలేదని తెలిపారు రైతులు వ్యవసాయానికి పెట్టుబడి సహాయం కింద ఒక రైతుకు ఒక ఎకరా కింద రూ.20వేలు ఇవ్వాలని పదేపదే డిమాండ్ చేస్తున్నా ఆ ప్రస్తావన కూడా లేదని అన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామనే ప్రక్రియను ఉపసంహరించుకోలేదని, రసాయనిక ఎరువుల ధరలు తగ్గింపు హామీలు ఎక్కడా లేవని అన్నారు. ఇది పూర్తిగా పెట్టుబడిదారులకు అనుకూల బడ్జెట్ అని విమర్శించారు. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా రైతాంగం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నరేష్, రామాంజినేయులు, సురేంద్ర యాదవ్, నాగరాజు పాల్గొన్నారు.

గురు రాఘవేంద్ర పంప్‌హౌస్‌లో విధ్వంసం

- కీలక పరికరాలను ధ్వంసం చేసిన దుండగులు
- మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



జీఆర్‌పీ మాధవరం పంప్ హౌస్



ధ్వంసమైన స్టార్టర్లు

మంత్రాలయం, జూలై 28: మంత్రాలయం మండలంలోని మాధవరం, రచ్చుమర్రి గ్రామ సరిహద్దుల్లో తుంగభద్ర నది ఒడ్డున గురు రాఘవేంద్ర ప్రాజెక్టులో కీలక పరికరాలు ధ్వంసమయ్యాయి. మాధవరం పంప్ హౌస్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విధ్వంసానికి పాల్పడ్డారు. అందులో ఉన్న రైతులకు సాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్న బ్రేకర్లు, స్టాటర్లు, ఇన్సులేటర్లు తొలగించి, సుత్తిలతో పగులకొట్టారు. ఏమైనా దోచుకెళ్లారంటే అది లేదు.. కసితో, పగతో, కుట్రతో రైతులకు సాగునీరు అందకూడదన్న దురుద్దేశంతోనే ఈ ఘతుకానికి పాల్పడినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ ధ్వంసంపై ఏఈ హరిప్రసాద్ మాధవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2005లో పంప్‌హౌస్ పనులు ప్రారంభించారు. 2013లో పనులు పూర్తి చేసి 2016-2021 వరకు సంబంధిత కాంట్రాక్టర్లే మెయిటెన్స్ చేస్తూ సాగునీరు అందించారు. అయితే 2019 నుంచి వైసీపీ ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వకపోవడంతో జీఆర్‌పీకి మరమ్మతులకు నోచుకోలేదు. ఈ ఏడాది ముందస్తుగా తుంగభద్ర నదికి నీరు విడుదల విషయం తెలుసుకున్న జీఆర్‌పీ ఈఈ భాస్కర్ రెడ్డి, డీఈ కృపానిధి, ఏఈ హరిప్రసాద్, లస్కర్లు రాంబాబు, రమేష్‌లు ఈ నెల 24వ తేదీన మాధవరం పంప్ హౌస్ స్టేజ్-1ను పరిశీలించారు. ఆదివారం బెళగల్, రచ్చుమర్రి, మాధివరం చెందిన 20 మంది రైతులు పంప్ హౌస్ వద్దకు వెళ్లి నీటిని విడుదల చేసేందుకు ప్రధాన డోర్‌ను తెరిచారు. అయితే అప్పటికే వెనుకడోర్ తెరిచి ఉండటం, హెచ్‌పీ ప్యానెల్, ఎల్‌టీ ప్యానెళ్లు చెల్లాచెదురుగా పడి ఉండటం గమనించి జీఆర్‌పీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందులో 6.6 కేవీ మూడు బ్రేకర్లు, 33 కేవీమూడు బ్రేకర్లు, రెండు స్టాటర్లు, మూడు ఇన్సులేటర్లులో ఉన్న 9 పీటీలను గుర్తు తెలియని వ్యక్తులు సుత్తితో ధ్వంసం చేశారు. 4,200 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 885 హెచ్‌పీ రెండు మోటార్లు, బెళగల్ వద్ద 7.30 కిలోమీటర్ల పైపులైన్ వేసి బెళగల్ రిజర్వాయరుకు 50 ఎంసీఎఫ్‌టీ సామర్థ్యం గల రిజర్వాయరును పూర్తి చేశారు. అందులోకి నీరు పంపింగ్ చేసి అక్కడి నుంచి రైతులకు బెళగల్ రిజర్వాయరు పంప్‌హౌస్ స్టేజ్-2 నుంచి తాగునీరు అందించాలి. ధ్వంసమైన పరికరాల విలువ రూ.10 లక్షలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా ఐదేళ్లలో ఈ పంప్‌హౌస్ మరమ్మతులకు గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.20 లక్షలను విడుదల చేసేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఇలాంటి ఘటన జరగడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దొంగలైతే వీటిని అమ్మి సొమ్ము చేసుకునే వారనీ, టీడీపీ ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదన్న దురుద్దేశంతో ఇలాంటి దుశ్చర్యకు పాల్పడినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్

22 బైకులు, ఆటో స్వాధీనం



కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు, జూలై 28: ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో శరీన్ నగర్, ఆదోనిలో అరుణ్ జ్యోతి నగర్‌లలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడులలో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 22 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేశారు. రౌడీషీటర్లు, అనుమానిత ప్రాంతాలు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శరీన్‌నగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ దాడులలో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 19 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఫోర్త్ టౌన్ సీఐ శంకరయ్య, కర్నూలు రూరల్ సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి, కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, సెబ్ పోలీసులు, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, జావేద్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, వంద మంది పోలీసులు పాల్గొన్నారు.

ఆదోని సబ్ డివిజన్‌లో: ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో ఆదోని త్రీటౌన్ పరిధిలోని అరుణ్ జ్యోతి నగర్‌లో దాడులు చేశారు. ఈ దాడుల్లో ఒకరిని అదుపులోకి తీసుకుని 253 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు వీటి విలువ (రూ.22వేలు), ఎలాంటి ధ్రువపత్రాలు లేని మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఆదోని పట్టణ సీఐలు తేజమూర్తి, గోపి, నరసింహరాజు, తాలుకా సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

11న బలిజ సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

కర్నూలు(కల్చరల్), జూలై 28: ఆగస్టు 11వ తేదీ ఉదయం 11 గంటలకు కర్నూలు జిల్లా, నగర బలిజ సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ అన్నారు. ఆదివారం నగరంలోని బలిజ సంఘం కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని బలిజ సంఘీయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సంఘానికి ఎన్నికలు నిర్వహించలేదని, అందువల్ల కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పదవులు కార్పొరేషన్లలో, మార్కెట్ యార్డు కమిటీల్లో బలిజ సంఘీయులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంలో తమ సంఘానికి తగిన గుర్తింపు ఉందన్నారు. బలిజ సంఘం నాయకుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసులు, సురేష్, గాండ్ల లక్ష్మన్న, గాజుల సతీష్, అమర్‌నాథ్, శైలేష్, సహదేవుడు, సుజాత, బ్రాహ్మణి దేవి, ఐకాన్ రామకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), జూలై 28: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగాధిపతి డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. జనవరిలో జరిగిన పరీక్షలకు 2913 మంది దరఖాస్తు చేసుకుని పరీక్షలు రాయగా, 851 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

బైక్‌ను ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



రాజునాయక్(ఫైల్)

గడివేముల, జూలై 28: వసతి గృహంలో చదువుతున్న కొడును చూసి తిరిగి ఇంటికి వస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన గడివేముల మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. ఎల్‌కే తండకు చెందిన రాజునాయక్ (37), సావిత్రిబాయికి నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు సంతానం. కొడుకు శివశంకర్‌నాయక్ పాణ్యం మండలంలోని గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఆదివారం కొడుకును చూసేందుకు రాజు నాయక్, అతడి భార్య సావిత్రిబాయి దిచక్రవాహనంపై పాణ్యం వెళ్లారు. కొడుకును చూసి బాగా చదువుకోవాలని చెప్పి తిరిగి తమ స్వగ్రామానికి వారు బయల్దేరారు. మార్గమధ్యంలో రాజునాయక్ ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో రాజునాయక్ ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఇదిలా ఉండగా రాజునాయక్ మొదటి కుమార్తె వివాహం మరో రెండు వారాల్లో జరగాల్సి ఉంది. శుభకార్యం జరగాల్సిన కుటుంబంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలంలో రాజునాయక్ భార్య, బిడ్డలు రోధించిన తీరు కలిచివేసింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై వివరాలు సేకరించారు. బాధితుల నుంచి ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రైలు నుంచి పడి యువకుడి మృతి

ఆదోని, జూలై 28: రైలు నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఆదోని మండలం కుప్పగల్లు-కోసిగి రైల్వేస్టేషన్ల మధ్య ఈ ఘటన జరిగిందని ఎస్సై గోపాల్ తెలిపారు. మృతి చెందిన యువకుడు మంత్రాలయం మండలం తుంగభద్రకు చెందిన విజయ్ (15)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా హాస్పిటల్ తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాటు సారా స్థావరాలపై విస్తృత దాడులు

కర్నూలు(అర్బన్), జూలై 28: కర్నూలు నగరంలోని బంగారుపేటలో నాటుసారా స్థావరాలపై పోలీసులు విస్తృత దాడులు చేశారు. ఆదివారం సెబ్ పోలీసులు, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా నగరంలోని పలు కాలనీలో విస్తృత దాడులు చేశారు. బంగారుపేట నాటుసారా స్థావరాలపై దాడి చేసి 1900 లీటర్ల నాటుసారా, తయారీకి సిద్ధంగా ఉన్న బెల్లం ఊటను, 50 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. బంగారుపేటకు చెందిన షికారి మాధవి నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో టూటౌన్ సీఐ ఇంతియాజ్, ట్రైనీ ఏఈఎస్ హర్ష, ఎస్ఐలు మారుతి, రెహానాబేగం, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి వైద్య సదస్సు

నంద్యాల (నూనెపల్లె), జూలై 28: ఈఎన్టీ వైద్యుడు డాక్టర్ మధుసూదనరావు ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న 34వ ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం, రెండు రోజులపాటు జరిగిన ఈఎన్టీ వైద్యుల రాష్ట్ర సదస్సు ఆదివారంతో ముగిశాయి. మొత్తం 110 మందికి శస్త్ర చికిత్స, వెయ్యి మందికి పైగా ఉచితంగా వైద్య సేవలు అందించారు. రూ.50 లక్షల విలువైన వైద్యసేవలు నిరుపేదలకు అందించారు. కార్యక్రమంలో ఈఎన్టీ సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ విజయేంద్ర, డాక్టర్ దీపక్, డాక్టర్ వినయ్ విజయేంద్ర, రవికృష్ణ డాక్టర్ నాగమణి, డాక్టర్ మణిదీప్‌లు పాల్గొన్నారు.

ఇదో రకం దందా..!

- ఒక్కో కార్మికుని నుంచి రూ.10 వేలు
- నగర పాలక సంస్థలో అధికారులు, యూనియన్ నాయకుల ఇష్టారాజ్యం
- జీతాలు పెంచింది తామేనని రూ.20 లక్షలు వసూలు
- లబోదిబోమంటున్న కార్మికులు



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

కర్నూలు(న్యూసిటీ), జూలై 28: నగర పాలక సంస్థ పరిధిలోని మరుగుదొడ్ల కార్మికులు, డ్రైవర్ల నుంచి అధికారులు, యూనియన్ నాయకులు వసూళ్లు చేస్తున్నారు. గత ప్రభుత్వం కార్మికులకు రూ.6 వేలు, డ్రైవర్లకు రూ.3500 జీతాలు పెంచింది. దీనికి తామే కారణమని, దగ్గరుండి తామే జీతాలు పెంచామని యూనియన్ నాయకులు అంటున్నారు. అది కాదు.. తమ వల్లనే జీతాలు పెరిగాయని కొందరు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దోచుకుంటున్నారు. ఓ యూనియన్ నాయకులైతే ఏకంగా కార్మికులు డబ్బులు ఇవ్వకపోతే వారి నుంచి రూ.20 నుంచి రూ.30 వేలు అప్పు తీసుకున్నట్లు బాండ్ పేపర్ల మీద సంతకాలు చేయించుకున్నట్లు తెలుస్తున్నది.

నగర పాలక సంస్థ పరిధిలోని 52 వార్డులకు 16 డివిజన్లను ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌కు ఒక్కో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. గత ప్రభుత్వం 95 మంది పబ్లిక్ హెల్త్ కేర్ టేకర్స్‌కు, 58 మంది డ్రైవర్లకు జీతాలు పెంచింది. దీంతో కార్మికుల మీద గద్దల్లా యూనియన్ నాయకులు, అధికారులు వాలిపోయారు. బలవతంగా వసూళ్లు చేస్తున్నారు. ఇదంతా గత రెండు నెలల నుంచి జరుగుతోంది. తాము ఒక్కరమే ఈ డబ్బులు తీసుకోవడం లేదని..ఇందులో కొంత కార్యాలయంలో అధికారులు..ఉద్యోగులకు కూడ ఇవ్వాలని యూనియన్ నాయకులు కార్మికులతో చెప్పారు. డబ్బులు ఇవ్వమని కొందరు కార్మికులు మొండికేస్తే... అధికారులతో చెప్పి అలాంటి వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామనే బెదిరిస్తున్నట్లు కూడా తెలుస్తోంది. ఈ విషయం గతంలోనే కార్యాలయంలోని ఉన్నతాధికారి దృష్టికి కార్మికులు తీసుకెళ్లారు. ఆయన యూనియన్ నాయకులను పిలిపించి- కార్మికుల నుంచి డబ్బు వసూళ్లు చేసుకోడానికి తమ పేరును వాడుకోవద్దని, మధ్యలో అధికారులను ఎందుకు ఇరికిస్తారని హెచ్చరించి పంపించారు. ఇదే తడవుగా యూనియన్ నాయకులు మరో అడుగు ముందుకేసి డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో కార్మికుల నుంచి డబ్బుల వసూలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వసూలు చేసి ఇస్తే అందులో కొంత మొత్తం మీకు ఇస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు చెప్పారు. దీంతో వారు కూడా కార్మికుల నుంచి బలవంతంగా వసూలు చేశారు.

అధికారుల వంతు వచ్చింది....

యూనియన్ నాయకులు అడిగిన వెంటనే కార్మికులు డబ్బులు ఇస్తుండటంతో కొందరు అధికారులకు కూడా ఆశ పుట్టింది. వీరు కూడ శానిటరీ ఇన్‌స్పెక్టర్లను మధ్యలో పెట్టి డబ్బులు వసూలు చేయించారు. ఇవ్వని కార్మికులు విధులకు హాజరు కానట్లు చూపించాలని ఒత్తిడి చేశారు. దీంతో కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చేసేదేమీ లేక..అధికారుల ఆదేశాలు పాటించి కార్మికుల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడ్డారు. ఇవ్వనివారిని మానసికంగా వేధించారు. యూనియన్ నాయకులు వసూళ్లకు పాల్పడితే అధికారులకు చెప్పుకున్నాము... కార్యాలయ అధికారులే బలవంతంగా వసూళ్లకు పాల్పడితే ఎవరికి చెప్పుకోవాలని కార్మికులు, డ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. యూనియన్ నాయకులు, అధికారులు కలిసి సుమారు రూ.20 లక్షలకు పైగా వసూలు చేసినట్లు తెలిసింది.

మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

కార్మికులు, డ్రైవర్ల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే విషయం మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. రెండు నెలల క్రితం యూనియన్ నాయకులు వసూలు చేస్తున్నారని కొందరు కార్మికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాను. అప్పుడే కమిషనర్ హెచ్చరించారు. మాకు తెలియకుండా యూనియన్ నాయకులు వసూలు చేస్తున్నారు.

- కే.విశ్వేశ్వరరెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్, నగర పాలక సంస్థ

గురుకుల పాఠశాలల్లో సీట్లను పెంచాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 28: జిల్లాలోని కేజీబీవీ, అన్ని యాజమాన్యాల గురుకుల పాఠశాలలో అదనపు సీట్లను పెంచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు మండలం పంచలింగాల కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ జిల్లాలో ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తారని, దీంతో వారి పిల్లలు వలస కూలీలుగా మారే ప్రమాదం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని అదనపు సీట్ల సంఖ్యను పెంచి ఆ పిల్లలకు ప్రవేశాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వడ్డె సోమన్న, నాయకులు బాలాజి, అజయ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేర్ల మార్పుపై హర్షం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 28: విద్యాసంక్షేమ పథకాలకు విద్యారంగంలో విశేష సేవలందించిన స్ఫూర్తి ప్రదాతలు, భారతమాత ముద్దుబిడ్డల పేర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఆర్‌జేయూపీ రాష్ట్ర ఆర్థిక ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజి బ్రహ్మం ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. విద్యాకానుకకు సర్వేపల్లి రాధాకృష్ణ, విద్యార్థి ప్రతిభా పురస్కారాలకు అబ్దుల్ కలాం, జగనన్న గోరుముద్దకు ఆంధ్ర అన్నపూర్ణగా పేరు గాంచిన డొక్కా సీతమ్మ పేర్లు పెట్టాలనే నిర్ణయం సముచితమని పేర్కొన్నారు.

వాహనాల వేలంలో రూ.2.54 లక్షల ఆదాయం



వాహనాల వేలం నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు (రూరల్), జూలై 28: కోడుమూరు స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన వాహనాలకు ఆదివారం వేలం నిర్వహించారు. ఏఈఎస్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో సుమారు 12 వాహనాలకు వేలం నిర్వహించినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఇందులో వేలం ద్వారా రూ.2,15,500, జీఎస్టీ రూపంలో రూ.38,790 ప్రభుత్వానికి ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ప్రభుత్వ ఖజానాకు జమ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది హనుమంతు, వీరుపాక్షిరెడ్డి, వెంకటేష్‌నాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

● కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన మద్యం బాటిళ్లను ఆదివారం ధ్వంసం చేశారు. ఏఈఎస్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో సీఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో సీజ్ అయిన మద్యాన్ని స్థానిక హంద్రీనది వద్ద వాహనంతో ధ్వంసం చేశారు. దాదాపు 27 కేసుల్లో 1780 లీటర్ల కర్ణాటక మద్యం, 13 కేసుల్లో 204 లీటర్ల తెలంగాణ మద్యం, 13 కేసుల్లో సీజ్ అయిన ఆంధ్ర మద్యం 40 లీటర్లను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. వాటి విలువ రూ 13,40,870 ఉంటుందని అన్నారు.



షాఫెసల్‌కు నివాళి



షాఫెసల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 28: జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన షాఫెసల్ (48) మృతి చెందాడు. ఆదివారం నగరంలోని కొత్తపేట తన నివాసంలో మృతదేహాన్ని జిల్లా క్రీడ సంఘాల ప్రతినిధులు సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్పోర్ట్స్ అధికారి అధికారి భూపతిరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు దాసరి సుధీర్, వేణుగోపాల్, జాఫర్ మున్నా, ఎంఎండీ బాషా, చిన్న సుంకన్న, నాగరాజు, దౌలత్‌బాషా,వేణుగోపాల్ తదితరుల ఉపాధ్యాయులు పలువురు సందర్శించి సంతాపం తెలిపారు.

గుప్పుమన్న గంజాయి



మత్తులో ఉన్మాద చర్యలకు పాల్పడుతున్న యువత

పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో గంజాయి వాడకం

కోడుమూరు, జూలై 28: యుక్త వయసులో విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన యువకులు గంజాయి ధూమపానానికి అలవాటు పడి బంగారు భవితను చేజేతుల నాశనం చేసుకుంటున్నారు. నగరాలకే పరిమితం అయిన గంజాయి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా పాకింది. కోడుమూరు పట్టణంలో రోజు రోజుకూ గంజాయి వాడకం పెరిగిపోవడం బహిరంగ రహస్యం. పట్టణంలో ఎక్కడ చూసినా గంజాయి వాసన గుప్పుమంటోంది. వ్యసనాలకు అలవాటు పడిన యువత, చివరకు గంజాయి మత్తుకు చిత్తవుతోంది. కిక్కికోసం ఏదైనా సరే అంటూ యువత గంజాయి వైపు మొగ్గుచూపుతోంది. సిగరెట్లలో ఉన్న పొగాకు పొడిని దులిపేసి అందులో గంజాయిని ఆకులను నింపుకొని దమ్ము లాగిస్తున్నట్లు సమాచారం. గంజాయి ధూమపానం సేవించిన యువకులు ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నారు. అల్లర్లు సృష్టిస్తూ ఇతరులపై అనవసరంగా గొడవలు, దాడులకు సైతం వెనకాడటం లేదు. అలాగే చిల్లర దొంగతనాలు, నేరాలకు కూడా పాల్పడుతున్నట్లు తెలిసింది. ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు కలిసి అతివేగంతో రోడ్లు, వీధుల్లో ప్రయాణిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ విషయాలన్నీ పోలీసులకు కూడా తెలుసు. అయినా తమకేమి పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో గంజాయి గుప్పుమంటున్నా... పోలీసులు మాత్రం స్టేషన్ విడిచి బయటికి రావడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి, ధూమపానం :

గంజాయి తీసుకునేందుకు యువకులు, మైనర్లు పట్టణంలోని కొన్ని నిర్మానుష్య ప్రాంతాలను ఎంచుకున్నారు. పట్టణంలో చెన్నకేశవస్వామి దేవాలయం, శ్రీనివాస టాకీస్, బోయగేరి, తుమ్మిళ వెంకట్రామిరెడ్డి దేవాలయం, పట్టణ శివారులోని శ్మశాన వాటిక తదితర ప్రాంతాలకు వెళ్లి గంజాయి దమ్ముకొట్టి మత్తులో జోగుతున్నారు. గంజాయిని పీలుస్తున్న యువత, మైనర్లను కొంత పెద్దలు చూసి మందలించిన సందర్భాలు ఉన్నాయి.



ఎక్కడి నుంచి వస్తోంది ?

పట్టణంలో గంజాయికి అలవాటు పడిన వాళ్ల సంఖ్య పెరుగుతోంది. కానీ ఆ గంజాయిని ఎక్కడి నుంచి సరఫరా అవుతుందని ప్రశ్నార్థకంగా మారింది. డోన్ నుంచి వస్తుందని, మరికొంత మంది కర్నూలు నుంచి వస్తుందని గుసగుసలాడుకొంటున్నారు. గంజాయి విక్రయాలు ఎక్కడి నుంచి జరుగుతున్నాయన్న విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

మా దృష్టికి రాలేదు

గంజాయి విషయం మా దృష్టికి రాలేదు. అయితే వీటిపై విచారిస్తాం. గంజాయి విక్రయించడమే కాదు. వాటిని వినియోగించినా నేరమే.

- బాలనరసింహులు, ఎస్ఐ, కోడుమూరు



బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ 'సినారె'

కర్నూలు(కల్చరల్), జూలై 28: తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆచార్య డాక్టర్ సి. నారాయణరెడ్డి చిరకాలం నిలిచి ఉంటారని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కొనియాడారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన డాక్టర్ సినారె 94వ జయంతి, సినారె గీతాలపై నృత్య ప్రదర్శనలు, అనంతరం సాంఘిక నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను కనువిందు చేశాయి. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో తొలుత డాక్టర్ సి. నారాయణరెడ్డి చిత్రపటానికి పుష్పమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూచిపూడి నాట్యాచార్యుడు కరీముల్లా ఆధ్వర్యంలో డాక్టర్ సి. నారాయణ రెడ్డి సినిమా పాటలపై చిన్నారులు ప్రదర్శించిన నృత్యాంశాలు అలరింపజేశాయి. అనంతరం నెలనెలా చివరి ఆదివారం ప్రదర్శించే సాంఘిక నాటక ప్రదర్శనల్లో భాగంగా గుంటూరు జిల్లా, కొలుకలూరులోని సాయి ఆర్ట్స్ థియేటర్స్ వారు ప్రదర్శించిన 'కౌసల్యా సుప్రజా రామా' నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. గోపరాజు విజయ్ దర్శకత్వంలో ఈ నాటకం ప్రదర్శించారు. నాటక ప్రదర్శన అనంతరం టీజీవీ కళాక్షేత్రం పక్షాన రూ.20మే పారితోషికం అందజేసి కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, రచయిత గద్వాల వీరన్న, జిల్లా రంగస్థల కళాకారులు సంఘం అధ్యక్షుడు గుర్రపుశాల అంకయ్య, సీనియర్ నటులు క్రిస్టఫర్, దస్తగిరి, కళాక్షేత్రం సభ్యులు కే బాలవెంకటేశ్వర్లు, సంగా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ సి. నారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

తప్పు చేసిన ఉద్యోగులపై చర్యలు సబబు : టీఎస్ఎఫ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 28: జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్లక్ష్యంగా పని చేస్తున్న వార్డెన్లపై జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ చర్యలు తీసుకోవడం సరైందేనని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, రాయలసీమ విద్యార్థుల జేఏసీ కన్వీనర్ రాగిరి చంద్రప్ప అన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ జిల్లాకు వచ్చినప్పటి నుంచి సంక్షేమ శాఖను గాడిలో పెట్టారన్నారు. బీసీ హాస్టల్‌లో పేద విద్యార్థులకు అండగా ఉంటూ మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. పెద్దపాడు బీసీ బాలుర వసతి గృహం హాస్టల్ వార్డెన్ సత్యనారాయణ రాజు గత రెండు వారాల కింద సస్పెండ్ అయినప్పటి నుంచి డీబీసీడబ్ల్యూవోపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నాడన్నారు. ఇది మంచి పద్ధతి కాదని నిజంగా డీబీసీడబ్ల్యూవో అవినీతిపై ఆరోపణలతో సహా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్షుడు ప్రకాష్, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు మధుకృష్ణ, దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాము, టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, ఆర్‌యుజేఏసీ రామకృష్ణ, నిరంజన్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప

'మహిళలపై అత్యాచారాలను అరికట్టాలి'

కర్నూలు(కల్చరల్), జూలై 28: రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో మహిళలు, యువతులు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, హత్యలను అరికట్టేందుకు ప్రభుత్వ కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. ఆదివారం నగరంలోని 48వ వార్డు రోజావీధిలో మహిళలతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యం మత్తులో మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని అన్నారు. నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలికపై అత్యాచారం, హత్య అలాగే అన్నమయ్య జిల్లా వీరబల్లిలో మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడం వంటి సంఘటనలు మరువక ముందే అనకాపల్లిలో మహిళను నిర్బంధించి అత్యాచారం చేయడం వంటి సంఘటనలు యువకులు డ్రగ్స్ సేవించడం వల్లే జరుగుతున్నాయని ఆమె అన్నారు. నగరంలోని తుంగభద్ర నదీ తీరాల్లో మద్యం, గంజాయి వంటివి యువకులు సేవిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న మీసాల సుమలత

జనసేనలో చేరిన రాయల మహిళలు

కర్నూలు(రాజ్ విహార్ సర్కిల్), జూలై 28: రాయల మహిళా సంఘంకు చెందిన మహిళలు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం జనసేన పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ సమక్షంలో ఆయన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అర్షద్ మాట్లాడుతూ జనసేన పార్టీ విధానాలు, పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి అన్ని వర్గాల ప్రజలు పార్టీ పట్ల ఆకర్షితులు అవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాయల మహిళ సంఘం ప్రతినిధులు సుమలత, బ్రాహ్మణి, విజయలక్ష్మి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన రాయల మహిళా సంఘం ప్రతినిధులు

గౌరు దంపతులను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కల్లూరు, జూలై 28: పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డిని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డా.వైకే. విశ్వనాథ్, జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం మాధవీనగర్‌లోని స్వగృహంలో ఎమ్మార్పీఎస్ నాయకుల బృందం గౌరు దంపతులను కలిసి అభినందనలు తెలిపింది. ఎన్ డీఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుభాస్‌చంద్ర, ఈశ్వరయ్య, ఆనంద్, కుమార్, సూరి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సమస్యలపై పోరాటం చేస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి

కర్నూలు(కల్చరల్), జూలై 28: నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 52 వార్డుల్లో ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ నగర సమితి శాఖా కార్యదర్శుల సమావేశానికి సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు నాగరాజు అధ్యక్షత వహించగా, జగన్నాథం, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నగరంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై దశల వారీగా పోరాటాలు చేసి వాటి పరిష్కారానికి పోరాటం చేస్తామని అన్నారు. ముఖ్యంగా నగరంలోని ట్రాఫిక్ సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. నగరంలో శివారు కాలనీలు, ప్రాంతాల్లో మంచినీళ్ల రెండు, మూడు రోజులకోసారి వస్తున్నాయని అన్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు డి.శ్రీనివాసరావు, గిడ్డమ్మ, ఈశ్వర్, అన్వర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బలిజ వివాహ పరిచయ వేదిక



ఉచిత బలిజ వివాహ పరిచయ వేదికకు హాజరైన బలిజ నాయకులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 28: రోపా, జీవీఆర్ మ్యాట్రిమోని ఫౌండర్ జీవీ రమణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత బలిజ వివాహ పరిచయ వేదిక కార్యక్రమాన్ని ఆదివారం మౌర్యాఇన్‌లోని విభూపరిణయ ఫంక్షన్ హాలులో కర్నూలు, అనంతపురం, ఒంగోలు, కడప, గద్వాల ప్రాంతాల నుంచి దాదాపు 600 మంది అవసరార్థులు కార్యక్రమానికి హాజరైనట్లు రోపా కర్నూలు జిల్లా అధ్యక్షులు చింతలపల్లి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ కుళ్లాయప్ప, రోపా ప్రతినిధులు కోనేటి చంద్రబాబు, కొట్టే చెన్నయ్య, ఆర్జా రామకృష్ణ, కోనేటి వెంకటేశ్వర్లు, అంచ పెద్దస్వామి పాల్గొన్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలను పరిరక్షించండి



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ హమీద్

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 28: మైనార్టీ ఉద్యోగుల ప్రయోజనాలు ప్రభుత్వం పరిరక్షించాలని ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ కోరారు. ఆదివారం స్థానిక మద్దూరునగర్‌లోని మైనార్టీ భవన్‌లో ఆల్‌మేవా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీ ఉద్యోగులకు 3 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని, కమ్యూనిటి హాలు నిర్మాణానికి స్థలాన్ని మంజూరు చేయాలన్నారు. మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన రూ.44 కోట్ల నిధులను సద్వినియోగం చేసుకునేలా సహకరించిన మంత్రి టీజీ భరత్‌కు సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘం సభ్యులు నూతన సభ్యత్వం కోసం రెన్యూవల్ చేసుకోవాలని అబ్దుల్ హమీద్ కోరారు. కార్యక్రమంలో ఆల్‌మేవా నాయకులు ఖాజామోహిద్దీన్, ఇలియాస్ భాషా, షబ్బీర్, మునీర్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమష్టి పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న హెల్త్ సెక్రటరీ కమిటీ ప్రతినిధి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 28: ఉద్యోగుల సమస్యలు, సంక్షేమం కోసం సమష్టిగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ గ్రామ వార్డు హెల్త్ సెక్రటరీ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.డి.అంజిబాబు, జిల్లా కార్యదర్శిగా సంధ్యారాణి, ఉపాధ్యక్షురాలుగా లావణ్యను ఎంపిక చేశారు. ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని మహేశ్వరమ్మ తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు చాముండేశ్వరి, దేవి, సుగుణమ్మ, యశోద, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర నదికి జలకళ

- నదీ పరీవాహక ప్రాంతాల్లో పర్యాటకుల సందడి



సంకల్‌బాగ్ వద్ద సందర్శకుల సందడి



కర్నూలు(కల్చరల్), జూలై 28: రాష్ట్రానికి ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర నదికి జలకళ వచ్చేసింది. హోస్పెటలోని తుంగభద్ర జలాశయం నిండటంతో అక్కడి నుంచి సుంకేసుల జలాశయానికి నీటిని వదలడంతో తుంగభద్ర నది పరవళ్లు తొక్కుతోంది. అలాగే నగరంలో నుంచీ శ్రీశైలం జలాశయానికి నిండు గోదావరిలా పారుతున్న తుంగభద్రమ్మను చూసేందుకు పర్యాటకులు ఉత్సాహం చూపుతున్నారు. నిన్న మొన్నటి వరకు రాళ్లు, ఇసుక తుప్పలతో కనిపించిన తుంగభద్ర నది నిండుగా పారుతూ పర్యాటకులను పరవశింపజేస్తోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో నగర వాసులతోపాటూ పరిసర ప్రాంతాలవాసులంతా తుంగభద్ర పరవళ్లు చూసేందుకు ఉత్సాహంగా తరలివచ్చారు. సుంకేసుల డ్యామ్‌తోపాటూ, పంచలింగాల సమీపంలోని తుంగభద్ర బ్రిడ్జ్, రైల్వే ట్రాక్, సంకల్‌బాగ్‌లోని తుంగభద్ర ఘాట్‌ల వద్ద పర్యాటకుల సందడి బాగా కనిపించింది. సంకల్‌బాగ్‌లో ఘాట్ మెట్ల వరకు చేరిన నీటిలో మహిళలు, చిన్నారులు కాళ్లు తడుపుకుంటూ ఉత్సాహంగా గడిపారు.



మంత్రాలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, జూలై 28: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహా ముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళ ప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. భక్తులు రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని పీఠాధిపతి ఆశీస్సులు పొందారు.

'తుంగభద్ర నదిలోకి అనుమతించవద్దు'



నది తీరంలో అధికారులతో మాట్లాడుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 28: తుంగభద్ర వరద ఉధృతి నేపథ్యంలో భక్తులను, గ్రామస్థులను ఎవరినీ కూడా నదిలోకి స్నానాలకు అనుమతించ వద్దని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. ఆదివారం సాయంత్రం తుంగభద్ర నది తీరంలో ఉధృతిని ఏఏవో మాధవశెట్టితో కలిసి పరిశీలించారు. భక్తులకు మరిన్ని షవర్లు ఏర్పాటు చేసి స్నానాలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా నది తీరంలో శుభ్రత ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల్లో భక్తులకు వసతి, సాగునీరు ఆహ్లాదకరమైన వాతావరణం వంటి అంశాల్లో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుని మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ పరిశీలనలో మఠం ఏఏవో మాధవశెట్టి, పురాణిక్, గోపి స్వామి తదితరులు ఉన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న రాష్ట్ర దూదేకుల సంఘం గౌరవ అధ్యక్షుడు సాయిబాబా

ఆదోని (అగ్రికల్చర్), జూలై 28: తల్లిదండ్రులను కోల్పోయి ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా జీవిస్తుండడంతో వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు దూదేకుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా ముందు కొచ్చి రూ.1,05,000 నగదును అందజేశారు. ఆదివారం ఆలూరు తాలూకా హాలహర్వి మండలం గూల్యం గ్రామానికి చెందిన దూదేకుల కాశీంసాబ్, షేకమ్మ దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి ముగ్గురు ఆడపిల్లలు అనాథలుగా మారి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో మారారని తమ దృష్టికి రావడంతో అక్కడికి వెళ్లి సాయం చేశామన్నారు. 15 ఏళ్ల కుమార్తె ఆసాభి మానసిక ఎదుగుదల లేక రెండో కుమార్తె సబియా, మూడో కుమార్తె ఆఫ్రీన్ దిక్కులేక జీవిస్తున్నారన్నారు. చదువుకునే వయసులో ఉన్న 8 ఏళ్ల సబియా తన అక్క మానసిక స్థితి చూసి కూలీ పనిచేసి పోషిస్తోందన్నారు. వారి పరిస్థితి తమ దృష్టికి రావడంతో వారికి ఆర్థిక సహాయంతో పాటు చదువుల బాధ్యత, అంగవైకల్యంతో ఉన్న ఆశాబీకి మెరుగైన వైద్యం అందిస్తామని ఆయన తెలి పారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. దూదేకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్రాంత తహసీల్దార్ షేక్షావలి, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్, నాయకులు కాసింసాబ్, పీర్ సాబు, ఇస్వి షేక్షావలి సావేష్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఉదారత

దేవనకొండ, జూలై 28: మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు బంకు శేకన్న తన ఉదారతను చాటుకున్నాడు. హాలహర్వి మండలం గూల్యం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు రూ.5 వేల ఆర్థిక సాయంతో పాటు నెలకు సరిపడే నిత్యవసర సరుకులను అందజేశారు. కుటుంబంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు తనవంతుగా మరింత సహాయం చేస్తానని, వారికి అపన్న హస్తం ఇచ్చారు.



చిన్నారులకు సాయం చేస్తున్న శేకన్న

'టీడీపీ హయాంలో యువతకు పెద్దపీట'

తుగ్గలి, జూలై 28: టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు పెదకదపీట వేసిందని టీడీపీ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్, రవి యాదవ్, లింగాయతుల రాష్ట్ర కార్యదర్శి కౌశిక్ కుమార్ అన్నారు. మండలంలోని జొన్నగిరిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు యువతకు భవిష్యత్తుకు పెద్దపీట వేయాలని 2024 ఎన్నికల్లో యువత టీడీపీ వైపే ఉందని అన్నారు.

'హంపా చెరువుకు నీరు ఇవ్వాలి'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, జూలై 28: మండలంలోని హంపా గ్రామ పంచాయతీ పరిధిలో గల చెన్నారెడ్డి, నాగిరెడ్డి చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరు సరఫరా చేయాలని బొమ్మనపల్లి సర్పంచ్ ఆంజనేయులు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అశోక్ కుమార్, టీడీపీ నాయకులు ఏమాంబరావు కోరారు. ఆదివారం బొమ్మనపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా ఆ రెండు చెరువులకు నీరు సరఫరా చేస్తే మండలంలోని హంపా, బొమ్మనపల్లి, రాంపురం, రాంపురం కొట్టాల గ్రామాలకు నీరు వస్తుందని అన్నారు. ఆ ప్రాంతాల్లో వేల ఎకరాల భూమి సాగులో ఉందని, రైతులందరూ లక్షల రూపాయలు వెచ్చించి పైపులైన్లు కూడా వేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చెరువులకు నీరు ఇవ్వలేదని, టీడీపీ హయాంలో చెరువులకు నీరు వదలాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, ఇరిగేషన్ ఏఈ నాయక్ వినతి పత్రం అందజేశామని చెప్పారు. వర్షాలు అంతంత మాత్రంగా ఉన్నాయనీ, ఇప్పటికే రైతులు పంటలు సాగు చేశారని, ఆగస్టులో హంద్రీనీవా కాలువకు నీరు వచ్చే అవకాశం ఉందని అందువల్ల ఆ చెరువులకు నీళ్లు వదలి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఉన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణ స్వామి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ హనుమంతప్ప



అవగాహన కల్పిస్తున్న మద్దికెర ఎస్ఐ రమేష్‌బాబు



అవగాహన కల్పిస్తున్న జొన్నగిరి ఎస్ఐ చంద్ర

కౌతాళం, జూలై 28: చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, చట్టాలు ఎవరికీ చుట్టాలు కావని ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి అన్నారు. కౌతాళం పోలీసు స్టేషన్‌లో ఆదివారం కోసిగి సీఐ ప్రసాద్, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి అధ్వర్యంలో ప్రజలకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకుని కనీసం వాటిపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 1860లో రచించిన ఐపీసీ, 1872లో రచించిన ఐఈఏ, 1873లో రచించిన సీఆర్‌పీసీ స్థానాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, భారతీయ సాక్ష్యా అదినయయం-2023 చట్టాలను ఈ సంవత్సరం జూలై 1 నుంచి అమలు అవుతున్నందున ప్రజలకి వీటిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వెంకటపతిరాజు, కాశీవిశ్వనాథ్, వీరేష్, మారెప్ప ఉన్నారు.

ఆస్పరి: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల ప్రజలతో కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ కొత్తగా న్యాయ వ్యవస్థల్లో కొత్త చట్టాలు అమలు జరుగుతున్నాయని, వాటిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లలోపు ఉన్నవారికి ద్విచక్ర వాహనం, ఫోర్ వీలర్ డ్రైవింగ్ చేయించడం చట్టరీత్యా నేరమని, అలా చేసిన వారి తల్లిదండ్రులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, లక్ష్మన్న, పోలీసు సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

తుగ్గలి: నూతన చట్టాలపైన ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జొన్నగిరి ఎస్ఐ చంద్ర సూచించారు. మండలంలోని జొన్నగిరి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన ప్రజలతో మాట్లాడారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ఆయా చట్టాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. చట్టాలను అతిక్రమించి ప్రవర్తించిన వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా మహిళా చట్టాలలో మార్పులు వచ్చాయని, మహిళలపై దాడులు చేయడం, దూషించడం వంటివి చేస్తే వారు శిక్షార్హులవుతారని అన్నారు.

మద్దికెర: చట్టాల్లో మార్పులు, చేర్పులు చేయడం జరిగిందని, జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకోవచ్చని ఎస్ఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం మద్దికెర మెయిన్‌బజార్ బస్టాండు ప్రాంతల్లో కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా మారిన సెక్షన్లు, చట్టాల గురించి వివరించారు. క్రిమినల్ కేసులు నమోదై విచారణ పూర్తి చేసి తీర్పు వచ్చేలా మార్పులు జరిగాయన్నారు. కొత్త చట్టాల్లో రాజద్రోహం అనే పదాన్ని తొలగించారన్నారు. ప్రజలు ఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంతంగా జీవించాలని కోరారు.

వరద నీటితో ప్రాజెక్టులను నింపండి

కోసిగి, జూలై 28: మండలంలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, పులికనుమ రిజర్వాయర్లకు తుంగభద్ర నది నుంచి వచ్చే వరద నీటిని నింపాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు కోరారు. తుంగభద్ర నదిలో నీరు భారీ ఎత్తున వచ్చి చేరుతుండటంతో యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులకు రిజర్వాయర్లకు నీటిని నింపి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.

'మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి'



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 28: ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే మధ్యంతర భృతి 30% వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. అదివారం ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిటీని వెంటనే అమలుపరచాలని కోరారు. కమిటీ నివేదిక వచ్చేలోపు ప్రకటించాలన్నారు. 117 జీవో రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనులను తగ్గించాలన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమలో రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షుడు రఘురామయ్య, మండల అధ్యక్షుడు ముత్తన్న, మండల కార్యదర్శి మల్లికార్జున, కౌతాల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి, హనుమంత్‌రెడ్డి, హొళగుంద మండల అధ్యక్షుడు నాయక్, బీరప్ప, సంగమేశ్వర్, మాలిక్, భీమ్‌రెడ్డి, మల్లన్న, భాస్కర్, రాఘవేంద్ర, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మద్దికెర, జూలై 28: స్థానిక చిన్న నగిరి యాదవ కుటుంబానికి చెందిన జమేదార్ పృథ్వీరాజ్ (30) ఆదివారం మృతి చెందారు. మద్దికెర గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి విజయదశమి రోజున యాదవ కుటుంబాలకు చెందిన యాదవరాజులు అశ్వాల పరుగు పంద్యాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ నెల 24వ తేదీన గుర్రంపైన అశ్వాల పరుగు పందెంలో ప్రాక్టీసు చేయడానికి మద్దికెర నుంచి బొజ్జనాయునిపేటకు గుర్రంపై వెళుతుండగా.. ప్రమాదవశాత్తు కింద పడడంతో చికిత్స నిమిత్తం గుంతకల్లుకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పృథ్వీరాజ్‌కు భార్య గాయత్రి, ఒక కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

'అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి'

ఆలూరు, జూలై 28: ఆలూరు పట్టణంలో కొత్తగా ఏర్పాటైన జై చిరంజీవ హమాలి యూనియన్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, బిమల్లికార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ బీ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లేబర్ అధికారులు డబ్బులకు ఆశపడి ఎలాంటి విచారణ చేయకుండా కొత్త యూనియన్ అనుమతి ఇవ్వడం వల్ల 30 సంవత్సరాలుగా ఏఐటీయూసీ అధ్వర్యంలో పనిచేస్తున్నటువంటి బస్టాండ్ హమాలీ కార్మికులపై ప్రభావం పడుతుందన్నారు.. ఇప్పటికైనా జై చిరంజీవ హమాలీ యూనియన్ రిజిస్టేషన్‌ను రద్దు చేయకపోతే రాష్ట్ర కార్మికశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

'హామీలు అమలు చేయాలి'



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

ఎమ్మిగనూరు, జూలై 28: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అరాచకాలు పెరిగి పోయాయని, అరాచకాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎంపీ బుట్టా రేణుక అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పచ్చ కండువా కప్పుకున్న వారు ఎక్కడికి వెళ్లినా, ఏమి చేసినా అడిగే వారు ఉండరని ఒక సందేశాన్ని టీడీపీ అధినాయకత్వం పంపిందన్నారు. దీంతో నేడు స్థానికంగా కార్యకర్తలు రెచ్చిపోయి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు శాశ్వతంగా ఉండరనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. హామీలు అమలు చేతకాక శ్వేతపత్రాలు విడుదల చేస్తున్నారన్నారు. అవి శ్వేతపత్రాలు కావని.. సాకు పత్రాలన్నారు. మున్సిపల్ చైర్మన్ డా.రఘు, వైస్ చైర్మన్ నజీర్, నాయకులు ప్రతూల్ పాల్గొన్నారు.

'కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

ఆదోని టౌన్, జూలై 28: హిందువుల ఆరాధ్య దైవమైన వేంకటేశ్వర స్వామికి సంభందించిన సుప్రభాత సేవలను కించపరుస్తూ మాట్లాడిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడుతూ, హిందువుల దేవుళ్లను, దేవతా విగ్రహాలను విమర్శిస్తూ కించరచడం హిందువుల మనోభావాలను దెబ్బతిసే విధంగా ఉంటున్నాయన్నారు. అలాంటి వారిపై వెంటనే కేసులను నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు సాకరే ఈరన్న రావు, ప్రధాన కార్యదర్శి మరియాని చెన్నబసప్ప, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, భీమిరెడ్డి పాల్గొన్నారు.

'ఆలయ అభివృద్ధికి కృషి'



ఆలయం వద్ద సీసీ రోడ్డు వేయిస్తున్న సర్పంచ్ అరుణాదేవి

ఆలూరు, జూలై 28: ఆలూరు పట్టణంలో భీమలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నగరూర్ అరుణాదేవి అన్నారు.. ఆదివారం స్థానిక భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల విన్నతుల మేరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ పెద్దలు, భక్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి'

ఆదోని టౌన్, జూలై 28: వైసీపీ పాలనలో ప్రజాధనాన్ని నిలువుగా దోచుకొన్న ఆ పార్టీ నాయకులందరిపై కేసులను నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి (యంహెచ్‌పీయస్) రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్ డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో బుద్ధిస్ట్ మైనారిటీ జిల్లా కార్యదర్శి రామలింగయ్య ఎంహెచ్‌పీఎస్‌లో చేరి సభ్యత్వం తీసుకున్నారు. నూర్ మాట్లాడుతూ, జగన్ పాలనపై వ్యతిరేకతతో ప్రజలు ఘోరంగా ఓడించినా జగన్‌లో నియంతృత్వ పోకడలు పోలేదన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేయడానికే జగన్ కంకణం కట్టుకొన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన వారినందరినీ కోర్టులలో విచారణ జరిపి శిక్షించాలని ప్రజలు కోరుకొంటున్నారని అన్నారు. దోపిడీకి గురైన ప్రజాధనాన్ని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. సమితి నాయకులు హాసన్, వసీం సాహెబ్, షకీల్, సద్దాం పాల్గొన్నారు.

'సూర్యనారాయణపై ఆరోపణలు తగవు'



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 28: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై రాష్ట్ర కార్యదర్శి బాస్కర్ రావు అసత్య ఆరోపణలు చేయడం తగదు అని ఆ సంఘం ఆదోని తాలూకా అధ్యక్షుడు రషీద్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం టీబీపీ ఎల్ఎల్‌సీ కార్యాలయం వద్ద తాలూకా ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ విజయవాడలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పదవి నుంచి ఆస్కారావును తొలగిస్తూ తీర్మానం చేశారన్నారు. పదవి నుంచి తొలగించడాన్ని జీర్ణించుకోలేని ఆస్కార్ రావు రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణపై అసత్య ఆరోపణలు చేస్తూ బహిష్కరణ చేస్తున్నామని చెప్పడం సంఘాన్ని తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఉద్యోగులకు అండగా ఉంటూ ఒకటో తేదీన జీతాలు ఇచ్చేలా గవర్నర్‌కు ఫిర్యాదు చేయడమే కాకుండా రావలసిన బకాయిలపై పోరాడిన వ్యక్తి సూర్యనారాయణ అని గుర్తుంచుకోవాలన్నారు. వారు చేస్తున్న అసత్యాలను ప్రభుత్వ ఉద్యోగులు ఎవరు నమ్మవద్దని, నిజాలు త్వరలోనే బయటకు వస్తాయన్నారు. ఆయన మాటలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, వీరేష్ కార్యదర్శి రామకృష్ణ, దేవోజీ, నబి రసూల్ పాల్గొన్నారు.

సచివాలయానికి జగన్ చిత్రం



సాంబగల్లు సచివాలయానికి ఉన్న జగన్ చిత్రం

ఆదోని రూరల్ 28: వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ సచివాలయాలకు తన చిత్రాలను వేయించుకున్నారు. అయితే ఏన్డీయే ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు కావస్తున్నా, పలు ప్రభుత్వ కార్యాలయాలకు జగన్ చిత్రం దర్శనమిస్తూనే ఉంది. ఆదోని మండలం సాంబగల్లు గ్రామ సచివాలయంలో ముందుభాగంలో జగన్ ఫొటో ఇప్పటికీ అలానే ఉంది. అక్కడ సిబ్బంది ఫొటోను తొలగించడానికి పూనుకుంటే అదే గ్రామానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు మోకాలడ్డు వేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఏది ఏమైనప్పటికీ స్థానిక మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. ఇప్పటికైనా అధికారులు వైసీపీ జపం మానాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రభుత్వ కార్యాలయాలకు ఉన్న జగన్ ఫొటోలను తొలగించాలని ప్రజలు, ఏన్డీయే నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

శాకంబరీదేవిగా వాసవీమాత

మద్దికెర, జూలై 28: స్థానిక నగరేశ్వరి స్వామి దేవాలయంలో వెలసిన వాసవి మాతను ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం వాసవీమాత శాకంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారిని కూరగాయలతో అర్చకులు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు పాల్గొని ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ముత్యాల రాజశేఖర్, సుంకు రవీంద్ర, కాశీ విశ్వనాథ్, కృష్ణ, తిమ్మయ్య, మధు, సుధ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



శాకంబరి దేవిగా దర్శనమిచ్చిన వాసవీమాత

పీఈటీ అసోసియేషన్ కమిటీ ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 28: జోన్ పీఈటీ అసోసియేషన్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఎమ్మిగనూరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీవర్స్ కాలనీలో రాజారామ్మోహన్ అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఏపీ ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడిగా బజారప్ప, ప్రధాన కార్యదర్శిగా యు. రవీంద్ర ఉపాధ్యక్షులుగా ఎస్.రామన్న జాయింట్ సెక్రటరీగా జె. ఉమాపతి, ట్రెజరర్‌గా ఇ.ఈరన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జేబీ కృష్ణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఏపీ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనాథ్, సెక్రటరీ పుల్లన్న పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఆస్పరి, జూలై 28: మండలంలోని చిన్న హోతూరు గ్రామ సమీపంలో గుర్తుతెలియని మృతదేహం ఆదివారం లభ్యమైంది. సీఐ హనుమంతప్ప తెలిసిన వివరాలివీ.. చిన్న హోతూర్ సమీపంలో అనుమానాస్పదంగా వంకలో ఒక డ్రమ్మును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని డ్రమ్మును ఓపెన్ చేశారు. డ్రమ్ములో సుమారు 45 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహాన్ని గమనించామని తెలిపారు. ఎవరైనా వ్యక్తిని చంపి ఇక్కడ వేశారా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

మద్దికెర, జూలై 28: మద్దికెర గ్రామంలో దోమల ఉధృతితో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందనే ఉద్దేశంతో సర్పంచ్ బండారు సుహాసిని పంచాయితీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ఫాగింగ్ చేశారు. వర్షాలు కురుస్తున్న సమయంలో మురుగు కాలువల్లో దోమలు వ్యాప్తి చెందుతు. సీజనల్ వ్యాదులు వ్యాప్తి చెందుతాయని, అందువల్ల పంచాయితీ ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా పంచాయతీ పరిధిలోని అన్ని వీధుల్లో దోమల నివారణ మందులు ఫాగింగ్ చేశారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయ్, పంచాయతీ మేస్త్రీ లక్ష్మన్న, తదితరులు ఉన్నారు.

ఎస్టీయూ అకడమిక్ కమిటీ సభ్యుడిగా మహదేవప్ప

ఆదోని (అగ్రికల్చర్), జూలై 28: ఎస్టీయూ రాష్ట్ర అకడమిక్ కమిటీ నూతన సభ్యుడిగా ఆదోని మండలంకు చెందిన ఉపాధ్యాయుడు రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్పను రాష్ట్ర కమిటీ ఎన్నుకుంది. గత రెండు రోజుల క్రితం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మహదేవప్పను ఎన్నుకోవడం పట్ల ఎస్టీయూ ఆదోని కౌతాళం మండల అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, సుధాకర్, గురు సాగర్, తాయన్న, ఖాదర్ బాషా హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల కొరకు నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి మహాదేవప్పను రాష్ట్ర అనుబంధ కమిటీలో చోటు కల్పించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు గోపాల్, రామాంజనేయులు, షేక్షావలి, ఆంజనేయ అభినందనలు తెలిపారు.

వాడుముఖం పట్టిన పత్తి పంట



వర్షాలు లేక వాడుముఖం పట్టిన పత్తి పంట

దేవనకొండ, జూలై 28: వరుణుడు ముఖం చాటేయడంతో రైతు దిగాలు చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ మొదట్లో వర్షం పర్వాలేదనిపించినా, ఆ తర్వాత సరైన స్థాయిలో పంటలకు వర్షం లేదు. నిత్యం ఆకాశంలో నీలి మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నా వర్షం కురవకపోవడంతో పంటల పెరుగుదల ఆశించినంతగా లేదు. వేలాది రూపాయాల పెట్టుబడులు ఈసారి మట్టిపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరణుడు కరుణిస్తే రైతుల పంటలకు ప్రాణం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.